
# పనిలేనోడి తలకాయ

ఎస్.ఆనందరాజు



ఎందుకో ఉన్నట్టుండి కవితారావుకి సాహిత్యమ్మీద ఎన్నడూలేని అభిమానం, అభిరుచి ఏకకాలంలో పొడపుట్టుకొచ్చాయి.

జనరల్‌గా చెప్పాలంటే కవితారావు బిజినెస్ పనుల్లో ఎప్పుడూ తలమునకల వుతుండేవాడు. అతని ధోరణంతా వ్యాపారమయం. ఉదయం తొమ్మిదింటికల్లా ఫ్రెష్షయ్యి, బ్రేక్ ఫాస్ట్ పేరు మీద ఇడ్లీనో, ఉప్మానో, మరింకొకటేదో రెండు ముద్దలు గబగబామని దిగమింగుకొని, ఫైళ్ళు, కాగితాలున్న బ్రీఫ్‌కేస్‌ని చేతపట్టుకొని, ఆఘమేఘాల మీద పరుగెత్తి రన్నింగ్ బస్సును క్యాచ్ చేసి, తోసుకుంటూ, తొక్కుకుంటూ పడుతూ, లేస్తూ, చస్తూ బతుకుతూ ఆఫీసుకు చేరుకునేవాడు.

సాయంత్రం ఆఫీసు పనులన్నీ ముగించుకొని పైన తెలిపిన బాధలు, వ్యధలు డిటో అనుభవిస్తూ ఒళ్ళంతా హూనమైపోయి, బాగా అలసి సొలసి వాడిపోయిన తోటకూరలా మొఖం నేల కేసి కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకునేవాడు. అలసిపోయిన దేహాన్ని చన్నీటి స్నానంతో చైతన్యం చేసి, అడ్డమైన గడ్డితినైనా సరే డబ్బు సంపాదించమని హితోపదేశము చేసిన ఉదరానికింత గడ్డో గరికో మేతికి నిద్రకు పక్రమించేవాడు.

అటువంటి బిజీ బిజినెస్ మేన్ అయినటువంటి మన కథానాయకుడైన కవితారావుకెందుకో సాహిత్యమ్మీదకు మనసు మళ్ళింది. మునుపటిలా ఆఫీసు పనుల మీద ఎక్కువ శ్రద్ధ చూపడం లేదు.

ఎప్పుడూ లెటర్లు డిక్టేట్ చేయడం, ఫైళ్ళు తిరగదోడడం, ఏవేవో కాగితాలు పరిశీలించడం, పిల్లి కాళ్ళతో బరికినట్లు చేత్తో కాగితాల మీద సంతకాలు బరకడం, ఫోన్ రింగ్ కాగానే 'హలో' అని మొరగడం, తన చాంబర్లోకి ప్రియులొచ్చినా, అప్రియులొచ్చినా, చివరికి అప్పుల వాళ్ళు వచ్చినా, రాని నవ్వును బలవంతంగానైనా తెచ్చి పెట్టుకోవడం లాంటి రొటీన్ లైఫ్ అతనికి బోలెడంత ఏవగింపును కలిగించింది.

విధిగా ప్రతి ఉదయం ఫలానా అధ్యాయం చదవాలని ఏ పవిత్ర గ్రంథమో తెరచినట్లుగా తన చాంబర్లోకి వెళ్ళగానే తన పర్సనల్ డైరీ తెరిచి ఆ రోజు తనకుండే విజిటింగ్‌లు, మీటింగ్‌లు, అపాయింట్ మెంట్లు చూసుకోవడం, ఎవరితో ఎలా వ్యవహరించాలి?, ఎవరితో ఏం మాట్లాడాలి?, ఎలా మాట్లాడాలి? వంటి వగైరా వగైరా విషయాల్ని మననం చేసుకొని, నాలుగైదు సార్లు రిహార్సల్స్ చేసుకొనే రొటీన్ లైఫ్ చాలా బోర్ అనిపించిందతనికి.

తన జీవితాన్ని కనిపించని శక్తులేవో ఈ ఆఫీసు పనుల్లో నిర్బంధించి బానిసగా చేసి ఈ పనులన్నీ చేయిస్తున్నాయేమోననిపించిందతనికి.

ఈ బానిసత్వపు సంకెళ్ళను తెంచుకొని, స్వేచ్ఛా జీవితాన్ననుభవించాలని నిర్ణయించు కున్నాడు. తన బిజినెస్ వ్యవహారాలన్నీ తమ పుత్ర రత్నంకు అప్పగించి సాహిత్య సేవ చేస్తూ జీవితాన్ని గడపాలని నిశ్చయించుకున్నాడు.

ఒకానొక ఫైన్ మార్నింగ్ అందరికంటే ముందుగా ఆఫీసుకు చేరుకున్నాడు మన కవితారావు. వాచ్‌మేన్ ఇంకా గేట్లు కూడా తీయలేదు.

ఈ వెధవ ఆఫీసుకు ఇంత ఎర్లీగా ఎవడొచ్చి

చస్తాడులేనని అల్లంత దూరంలో వేపపుల్లతో తీరికగా పళ్ళు తోముకుంటున్న వాచ్‌మేన్ కంట బడ్డాడు కవితారావుకి.

ఎప్పుడూ ఇంత ఎర్లీగా రాని తమ బాస్ ఈ రోజు ఎందుకింత ఎర్లీగా వచ్చి చచ్చాడబ్బా అని మనసులో అనుకొని, తొమ్మిది దాటినా ఇంకా ఆఫీసు తాళాలు తీయలేదని తన మీద పడి ఎక్కడ పిచ్చి కుక్కలా మొరుగుతాడోనని కాస్త భయపడ్డాడు వాచ్‌మేన్.

"గుడ్ మార్నింగ్ సార్." విష్ చేశాడు వాచ్‌మేన్.

"వెరీ గుడ్ మార్నింగ్" చిన్నగా ఓ చిరునవ్వు నవ్వి చెప్పాడు కవితారావు.

తనను పల్లెత్తి ఒక చిన్నమాట కూడా అననందుకు వాచ్‌మేన్‌కు తన బాస్‌పై ఎన్నడూ లేని గౌరవం కలిగింది తన బాస్‌ని అనవసరంగా పిచ్చి కుక్కని, పందికొక్కని, అదనీ, ఇదనీ మనసులో తిట్టుకున్నందుకు లెంపలేసుకున్నాడు.

పది దాటినా, ఆఫీసులోని కుర్చీలు ఖాళీగానే ఉన్నాయి. ఒకరొకరే వస్తున్నారు. తమ బాస్ ఆల్‌రెడీ చాంబర్లో వచ్చి చచ్చాడని తెలుసుకొని కంగారుగా ఫైళ్ళల్లో తలకాయలిరికించారు.

కవితారావు ఆఫీసులో ఆ రోజు ఎవర్నీ ఏమీ అనలేదు. మామూలుగా అయితే ప్రతిరోజు అందరి మీదా కేకలేసే వాడు. చిన్నదానికీ, పెద్దదానికీ బీపీ పేషెంట్‌లా రైజైపోయేవాడు. టైపిస్టు స్పెల్లింగ్ మిస్టేక్‌లు చేసినా, అకౌంటెంటు అంకెలు తప్పు రాసిన కూడా ఏమీ అనలేదు.

"రోజూ కడప ఎండలల్లే భగ్గున మండే మన బాసు ఈ రోజు ప్రశాంతంగా, ప్రసన్నంగా ఉన్నందుకు ఆఫీసు ఊటీలా ఉందం"టూ లంచవర్లో స్టాఫంతా జోకులేసుకొని నవ్వుకున్నారు.

లంచవర్ అయిపోగానే సర్క్యులర్ పంపించాడు ఫోర్థర్టీకి మీటింగుందని.

"ఓహో ఇప్పుడర్థమయింది మన బాస్ టెక్నిక్. ఈ రోజు అందరూ ఆలస్యంగా వచ్చిన వారే కదా! ఒక్కొక్కర్నే తిట్లతో సన్మానించడమెందుకని అందర్నీ ఒకేసారి తిట్లతో సన్మానించి సత్కరించాలనుకున్నాడోయ్. అందుకే ఈ మీటింగ్ కాబోలు" అని అన్నాడు హెడ్ క్లర్క్ ఏకాంబరం.

ఫోర్థర్టీకి మీటింగ్ హాలంతా స్టాఫ్‌తో నిండిపోయింది.

"ఇక ఈ కంపెనీ వ్యవహారాలన్నీ మా అబ్బాయి చూసుకుంటాడ"ని కవితారావు తమ పుత్రరత్నాన్ని సభకు పరిచయం చేశాడు.

"నా రిటైర్‌మెంట్ సందర్భంగా మీ కందరికీ నాలో దాగి ఉన్న కవిని చూపిస్తాన"ని ఓ కవిత లయబద్ధంగా, రాగయుక్తంగా చదివి వినిపించాడు.

అందరు ఒకేసారి ఉగాది పచ్చడి రుచి చూచినట్లుగా అందరూ వికారంగా మొఖాలు వేలాడ దీశారు.

చప్పట్లు కొట్టకపోతే మరికెన్ని కవితలు చదివి వినిపించి, ఎక్కడ తమ సహనాన్ని చీల్చి చెండాడి, ఎక్కడ తమ బుర్రల్ని బద్దలు కొడతాడోనని భయపడి, "బాగుంది. బాగుంది" అని చప్పట్లు కొట్టారు.



## నమ్మకం!

*'ప్రజాసేవే నా పరమార్థం' అంటూ నిన్నటి వరకు మైకు ముందు ఉపన్యాసాలిచ్చిన జయప్రద, ఈ రోజు నటన నా ఆరోప్రాణం అంటోంది. ఒక ప్రక్క 'నటన' నా ఊపిరి అంటూనే మరో ప్రక్క మరోసారి రాజ్యసభకి నామినేట్ చేయబడతాను, బాబు మీద నమ్మకముంది అంటోంది కొండంత భరోసా ఇస్తూ. (నీ మీద 'బాబు'కి నిజంగా నమ్మకముండొద్దూ?)*

మీటింగ్ హాలు నుండి బయటికొచ్చిన కవితారావుకి ఎదురుగా కారు డ్రయివర్ కనిపించేసరికి ఒళ్ళు మండిపోయింది.

"కారునెందుకు తీసుకొచ్చావ"ని ఆవేశంతో ఎగిరి పడ్డాడు.

"తమరీ రోజు రిటైర్‌మెంట్ ఇస్తున్నారట కదా! మీరు ఆఫీసు నుండి ఇంటికి ఒక రోజైనా కార్లో వస్తే చూచి తరించాలని అమ్మగారి ఏళ్ళ తరబడి కోరికట. రోజూ సిటీ బస్సుల్లో పడుతూ, లేస్తూ చావడం కంటే ఒక్కసారి చావడం మేలని, అదే వీరుని లక్షణం. ధీరుని ధ్యేయమని మీతో ఈ విషయం గట్టిగా చెప్పమని అమ్మగారు నాతో ఒకటికి పదిసార్లు చెప్పి మరీ పంపించారండి" అని కారు డ్రయివర్ నింపాదిగా, వినయంగా చెప్పాడు.

ఇక కవితారావు మారు మాట్లాడకుండా కారు వైపు నడిచాడు.

✳ ✳ ✳

ఓ మంచి ముహూర్తం చూసుకొని సాహిత్యం రాయడానికి నడుం బిగించాడు కవితారావు. ఒక మంచి కవిత రాసి ఒక ప్రముఖ పత్రికకు పంపించాడు. మూడు నాలుగు మాసాల తర్వాత ఆ పత్రికలో తన పేరును చూసుకొని సంకలు గుద్దుకొని సంబరపడిపోయాడు. తనకేదో పెద్ద అవార్డుతో పాటు రివార్డు కూడా వచ్చినట్లు తెగ సంబరపడిపోయాడు. ఫోన్లు మీద ఫోన్లు చేసి అందరికీ విషయం తెలియజెప్పాడు.

"మీ బోడి కవిత పేపర్లో పడిందని పట్ట పగలు ఎస్టీడీలు, ఐయ్యెస్డీలు చేయపోతేనేం? దిక్కుమాలిన ఆ పత్రికకు మ్యాటర్ ఏదీ దొరకక పోయేసరికి మీ పనికి మాలిన కవితను అచ్చుకొట్టుంటాడు" అని భార్య విరుచుకుపడింది.

"నీకేం తెలుసు నిమ్మకాయ పులుసు" అని భార్య మాటల్ని కొట్టి పారేశాడు.

గతించిపోయిన తమ తాత కవితారావు స్మృతి పథంలో మెదిలాడు.

"ఒరేయ్ వెధవా! మన వంశంలో పుట్టిన వారందరికి అంతో ఇంతో సాహిత్యమబ్బిందిరా! భ్రష్టుడా! నీవు ఉన్నావు ఎందుకూ? దేనికీ కొరగాకున్నట్లు. డబ్బూ డబ్బూ అంటూ బిజినెస్ ఊబిలో కూరుకుపోయావు. నీవు సొంతంగా ఏలాగూ ఓ పద్యం కూడా రాయలేవు. కనీసం మన వంశ గౌరవార్థం, "ఉప్పు కప్పురంబు" అనే పద్యమో, మరింకే పద్యమో కంఠస్థం చెయ్యరా అంటే చేతకాదంటావు. కనీసం ఓ సుమతి సూక్తైనా నేర్చుకోరా అంటే టైమ్ లేదంటావు. అప్రాచ్యుడా! మన వంశాన్ని అప్రతిష్టపాలు చేశావు కదరా!" అని తిట్టే తాతయ్య చచ్చి ఏ నరకంలో నో, ఏ స్వర్గంలో ఉన్నాడో తెలియదు కాని, అచ్చుకు నోచుకున్న ఈ నా కవితతో అతని ఆత్మ తప్పకుండా శాంతి పొందుతుందని సంతోషించాడు.

కవిత పేపర్లో అచ్చయిన సంతోషంతో ఓ కథ రాసి పంపాడు. తిరుగుటపాలో రాకెట్ వేగంతో దూసుకొచ్చి కవితారావు ఇంటి తలుపుల్ని తట్టింది.

ఇది మహా చెత్త కథై ఉంటుంది. ఈ కథను చదివిన ఎడిటర్ బుర్రంతా పాడైపోయి ఉంటుంది. అందుకే ఇంత యమస్పీడుగా అక్కడ తంతే ఎగిరొచ్చి ఇక్కడ పడిందని తనలో తాను అనుకున్నాడు. చిన్నగా నవ్వుకున్నాడు కూడా.

పత్రికల్లో మరో రెండు కవితలు చోటు చేసుకోడానికి ఓ సంవత్సర కాలం పట్టింది.

పనీ పాటా లేకుండా కేవలం కథనో, కవితనో రాయాలని విఫలయత్నం చేస్తున్న కవితారావుకు రెండు సంవత్సరాల కాలంలో బుర్ర బాగా బూజు పట్టిపోయింది.

సాహిత్యంలో ఏవేవో ప్రయోగాలు చేయాలని పిచ్చి పిచ్చి ఆలోచనలు తన ప్రమేయం లేకుండానే బుర్రలో పుంఖాను పుంఖాలుగా పుట్టుకొస్తున్నాయి. పెన్ను, పేపర్ తీసుకొని రాయడానికి

సిద్ధమయ్యాడు. ఏం రాయాలబ్బా! అని ఆలోచన లో పడ్డాడు.

వెదకబోయిన తీగ కాలికి తగిలిందన్నట్లుగా ఎక్కడో దూరంలో ఓ చెట్టు మీద కోయిల కూసింది. బూజు పట్టిన కవితారావు బుర్ర కాస్తా కోయిల కూతతో బ్రెయిన్ వాష్ అయినట్లయింది. వెంటనే కలం, కాగితం తీసుకొని -

"కోకిల కోకిల కూ.... అన్నది" అని ఒక పంక్తి పూర్తి చేశాడు.

ఎంత హుషారుగా, ఎంత ఉత్సాహంగా రాశాడో అంత నిరుత్సాహపడిపోయాడు ఇదేదో ఎక్కడో ఎప్పుడో విన్న సినిమా పాటలాగుందని.

"ఆ..... ఏముందిలే కొద్దిగా మార్పులు, చేర్పులు చేసి రాసి పారేస్తే సరి" అని తనను తాను సమాధాన పరచుకున్నాడు కవితారావు. మళ్ళీ రాయడానికి పూనుకున్నాడు.

"కోకిల కోకిల ఢా..... మన్నది
రాయలసీమ బాంబన్నది" అని రాశాడు.

ఇదేందిరోయ్ కోయిల ఏంటి, ఢా మనడమేమిటని తనలో తానే నవ్వుకున్నాడు.

ఛ! ఇప్పుడు కవిత్వం వచ్చేటట్లు లేదు. పోనీ ఏదైనా ఒక కథ రాద్దామని అనుకున్నాడు. కథను చాలా సహజంగా వాస్తవికతను అతి సమీపంగా రసవత్తరమైన సన్నివేశాలతో పాఠకుల మనసుకు హత్తుకొని పోయేటట్లు రాయాలని నిశ్చయించుకున్నాడు.

సహజమైన పరిస్థితుల్ని ఎలా ఫేస్ చేయాలని తనను తాను ప్రశ్నించుకున్నాడు.

ఇంట్లో చెప్పా చేయకుండా కాశీకో, రామేశ్వరంకో ఉడాయిస్తే సరి. మా కాంతం అగ్గి మీద గుగ్గిలమై ఇంతెత్తు లేవదూ?! అన్నం, సున్నం పెట్టకుండా అయిదారు రోజులు మలమలామని ఆకలికి మాడ్చేయదూ? ఇది చాలదా "భార్య బాధితుడు" అని ఓ కథ రాసి పారేయడానికి అని అనుకున్నాడు.

అనుకున్నదే ఆలస్యం కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు. రామేశ్వరానికి చెక్కేశాడు.

సరిగ్గా వారం రోజుల తర్వాత ఇంటికి తిరిగొచ్చిన కవితారావుకి ఇంటి తలుపులకేసిన తాళాల్ని చూడగానే గుండెల్లో గుబులు చోటు చేసుకుంది. పక్క పోర్షన్‌లో ఉండే పాపారాయుడొచ్చి - "మీ అబ్బాయి బిజినెస్ టూర్ మీద బాంబేకెళ్ళాడు. పది రోజుల తర్వాత వస్తానన్నాడు" అని చెప్పాడు.

"మరి మా ఆవిడ?" ఆతృతతో, ఆసక్తితో అడిగాడు కవితారావు.

"మీ ఆవిడ పుట్టింటికెళ్తానని చెప్పింది." నింపాదిగా జవాబిచ్చాడు.

"ఎప్పుడొస్తుందని చెప్పింది" తిరిగి ప్రశ్నించాడు కవితారావు.

# ఎస్.ఆర్.ఎం.టి. అధినేత అస్తమయం



రవాణారంగంలో అగ్రగణ్యుడిగా పేరు పొందిన ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ రామదాసు మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఎస్.ఆర్.ఎం.టి) అధినేత శ్రీ కంటిపూడి వీరరాజు చౌదరి ఊపిరితిత్తుల కాన్సర్ కారణంగా నవంబర్ 13వ తేదీ తెల్లవారు జామున మృతి చెందారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. గత నెలలో ఆయనని చికిత్స కోసం కాకినాడ నుంచి చెన్నయ్ తీసుకు వచ్చారు. ఒక ప్రయివేట్ హాస్పిటల్ ఐ.సి.యూ.లో చికిత్స పొందుతూ ఆయన అంతిమ శ్వాస విడిచారు.

శ్రీ కె.వి.ఆర్.చౌదరి 23 డిసెంబర్ 1928లో తూర్పుగోదావరి జిల్లాలోని ఏడిద గ్రామంలో పుట్టారు. రాజమండ్రిలోని గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం జరిగింది. ఆయన 1960లో ఎస్.ఆర్.ఎం.టిలో చేరి డైరెక్టర్ అయినారు. 1964 ఫుల్ టైం డైరెక్టర్‌గా, 1978లో మేనేజింగ్ డైరెక్టర్‌గా, 1980 నుంచి ఛైర్మన్‌గా ఉన్నారు.

ఆయనకి రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులతో పరిచయాలు ఉన్నాయి. ఎంతో కాలంగా తూర్పు గోదావరి జిల్లా రాజకీయాలపై ఆయన ప్రభావం ఎంతైనా ఉండేది. ఆధ్యాత్మిక రంగంలో కూడా ఆయనకి ఎంతో పరిచయం ఉన్నది.

శ్రీ కె.వి.ఆర్. చౌదరిగారికి భార్య, అయిదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. (ఒ.వి)

"ఇంకెప్పుడూ రానని చెప్పింది. మా ఆయన ఈ మధ్య అదోలా ప్రవర్తిస్తున్నాడని, అతని పిచ్చి లోకంలో అతనుంటున్నాడని, ఎప్పుడూ కథలూ, కవితలంటూ అందర్నీ విసిగిస్తున్నాడని, ఇలాంటి వారితో కాపురం వెలగబెట్టడం తలప్రాణం తోకకు తెచ్చుకోవడమేనని, ఇక అతనితో కాపురం చేస్తే నాకూ పిచ్చి పట్టేటట్లుందని చెప్పి, ఇదిగో ఈ ఉత్తరం ముక్కని మీ ముఖాన విసిరి కొట్టమంది"అని ఉత్తరం చేతిలో పెట్టాడు.

కవితారావు పరిస్థితి కళ్ళనీళ్ళ పర్యంతమయింది. బోరుమని ఏడ్వడం మొదలు పెట్టాడు. పసి పాపలా ఏడుస్తున్నాడు. పిచ్చివాడిలా ప్రవర్తిస్తున్నాడు.

పిచ్చి పిచ్చిగా ఏడుస్తున్న కవితారావును ఓదార్చుదామనుకున్నాడు పాపారాయుడు. కాని ఎంతో బలవంతంగా ఆపుకుందామనుకున్న నవ్వును ఆపుకోలేక పోయాడు. తత్ఫలితంగా కవితారావును ఓదార్చడంలో కూడా విఫలుడయ్యాడు.

కవితారావు ఏడ్పులను విని జనాలు గుంపులు గుంపులుగా ప్రోగయ్యేసరికి కవితారావుకి దుఃఖం ఇంకా ఎక్కువ అయింది. గట్టిగా రోదిస్తూ జుట్టు పీక్కున్నాడు. అంతటితో దుఃఖం తీరలేదు కాబోలు చొక్కా చించుకోవడం కూడా మొదలు పెట్టాడు.

"ఆపండి మీ వెకిలి చేష్టలు, పిచ్చి చేష్టలునూ. పనీ పాటా లేనోడి తలకాయ దయ్యాల బుర్ర లాంటిదట. ఈ మధ్య మీరు పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారు. ఇలాగైతే మిమ్మల్ని ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించాల్సొస్తుంది." గుంపులో నుంచి నాటకీయంగా దూసుకొచ్చిన కవితారావు భార్య కాంతమ్మ అంది.

"నా అనుమతి లేనిదే అర అంగుళం కూడా కదలని వారు నాకు చెప్పా చేయకుండా ఎక్కడికి వెళ్ళారు?" కర్కశంగా ప్రశ్నించింది కాంతమ్మ.

"భార్యలు భర్తల్ని బాధిస్తే, భర్తలు మానసికంగా ఎలా క్రుంగిపోతారో, ఎలా సఫర్ అవుతారో తెలియ జెప్పేందుకు "భార్య బాధితుడ"ని ఓ కథ రాద్దామని...." అంటూ నసిగాడు ఏడుస్తూనే.

"ఇంకా నయం భార్య చనిపోతే భర్త పరిస్థితి ఎలా ఉంటుందని ప్రయోగాత్మకంగా కథ రాసేందుకు బ్రతికి ఉన్న నన్ను చనిపోయిందని చాటింపు వేయలేదు. అంత వరకు సంతోషించాల్సిన విషయమే. ఇక నుండి బుద్ధిగా ఉండి ఏదో ఒక పనిలో నిమగ్నమయితే సరి లేకపోతే....." అంటు ఇంకా ఏదో చెబుతుంటే.

"బుద్ధిగానే ఉంటూ పనిలో నిమగ్నమవుతా"నని చిన్న పిల్లాడిలా చెప్పాడు కవితారావు.

కాంతమ్మ, కవితారావు చెట్టా పట్టాలేసుకొని ఇంటి ముఖం పట్టారు.